గిద్దలూరులో చైన్ స్నాచింగ్

గిద్దలూరు రూరల్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లిన సంఘటన గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని నంద్యాలరోడ్డులో గల జగనన్న కాలనీ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న నారాయణమ్మ అనే మహిళ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. వస్తువులు కొనుగోలు చేసిన సదరు దుండగుడు ఆమెతో మాటలు కలిపి హఠాత్తుగా మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయాడు. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.5 లక్షలకు పైగా నష్టం


కాలిపోతున్న పొగాకు బ్యారన్

వెలిగండ్ల(కనిగిరిరూరల్): ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం తెల్లవారుజామున వెలిగండ్ల మండలంలోని పాపిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మారం వెంకట సుబ్బారెడ్డి బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు అల్లిక కర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి బంగారు బాబు తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికి బ్యారన్‌లో ఆకు, కర్ర, టైర్లు తదితర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వెంకట సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

లారీని ఢీకొని యువకుడు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన మోహన్ వంశీ కృష్ణ
ఇన్‌సెట్‌లో మోహన్ వంశీ కృష్ణ(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివ
ఇన్‌సెట్‌లో మృతుడు వేమా నాగార్జున(ఫైల్)

సింగరాయకొండ: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సింగరాయకొండలోని కలికవాయ ఫ్లైఓవర్ దిగువన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బాలయోగినగర్‌కు చెందిన కూరపాటి మోహన్ వంశీకృష్ణ(23) కందుకూరులోని వివేకానంద కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయంలో కె.బిట్రగుంట వద్ద గల పాల ఫ్యాక్టరీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పాల ఫ్యాక్టరీకి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కలికవాయ ఫ్లైఓవర్ దిగువనఆగి ఉన్న లారీని వెనుక నుంచి వంశీ ఢీకొట్టాడు. పంక్చరైన టైరు మార్చుకునేందుకు రోడ్డు మార్జిన్‌లో లారీని నిలపగా వేగంగా వెళ్తున్న క్రమంలో వంశీ గమనించకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా, తల్లి నాగమణి స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. టంగుటూరు హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరో యువకుడు..

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని బోదనంపాడు సమీపంలో బందిళ్ల బావి వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివ కథనం ప్రకారం.. బోదనంపాడు గ్రామానికి చెందిన వేమా నాగార్జున(32) వ్యక్తిగత పని నిమిత్తం తన బైక్‌పై దర్శికి బయలుదేరాడు. గ్రామ శివారులోని బందిళ్ల బావి వద్ద బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి హద్దురాయిని ఢీకొట్టాడు. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఉంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత


విద్యార్థినితో ఆల్బెండజోల్ మింగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత సాధ్యమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బాలబాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 19 ఏళ్లలోపు విద్యార్థులు 5,96,751 మంది ఉండగా 6,80,000 మాత్రలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. భోజనానికి ముందు, కాలకృత్యాల తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతుల శుభ్రత విధానంపై అవగాహన కల్పించారు. అనివార్య కారణాలతో సోమవారం ఆల్బెండోజోల్ మాత్రలు మింగని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ ఎ.కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ వీకే గీతాలక్ష్మి, వైద్యులు పద్మజ, వాణిశ్రీ, ఖాశిం, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 69 ఫిర్యాదులు

ఒంగోలు సబర్బన్: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 69 మంది బాధితులు ఎస్పీ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఒంగోలు నగర శివారులోని కార్గిల్ పెట్రోల్ బంకు ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న వైద్యశాలకు ఆనుకుని ఉన్న తమ ప్లాట్లను కొందరు తమవి అంటూ బెదిరిస్తున్నారని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పలగాని రామసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులం కలిసి ప్లాట్లు కొనుగోలు చేయగా అమ్మిన వ్యక్తి డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి వేధిస్తున్నాడని వాపోయారు. 30 శాతం ఆదాయం వస్తుందని ఓ యాప్ ద్వారా ఆశ చూపి విడతలవారీగా రూ.11.80 లక్షలు తీసుకుని మోసం చేశారని ఒంగోలు బాలాజీ నగర్‌కు చెందిన వ్యక్తి వాపోయాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట పరిధిలో త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భర్త–అత్తారింటి వేధింపులు, చీటింగ్, ఉద్యోగాల పేరుతో మోసం, భూ వివాదాలే అధికంగా ఉన్నాయి.

ఒక్క మాత్రతో నులిపురుగులను నలిమేద్దాం


విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న చైర్మన్ గఫార్


ఆల్‌బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి సాయి రుచిత

● జాతీయ నులిపురుగుల దినోత్సవం

కనిగిరిరూరల్: నులి పురుగుల మాత్రలతో రక్తహీనతను నివారించవచ్చని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలోని పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆరోగ్యసిబ్బందితో కలిసి మాత్రలు మింగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ చిన్నారుల్లో నులిపురుగులతో అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయని వివరించారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయస్సు కల్గిన పిల్లలంతా తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. రోడ్ల పక్కన వేసే చిరుతిండ్లు, ఫాస్ట్ ఫుడ్, చిప్స్ ప్యాకెట్లు వగైరా హానికర పదార్థాలు తినవద్దని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లోని విద్యార్థులంతా నులిపురుగు మాత్రలు మింగే విధంగా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరెడ్డి, సచివాలయ, వైద్య శాఖ సిబ్బంది కే లక్ష్మీ, శ్రీనివాసులు, దుర్గా, పద్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జాతీయ నులుపురుగుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో 4165 మందికి నులుపురుగులు మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్ మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.రమణయ్య హెచ్‌ఎం సుబ్బారావు, సీహెచ్‌ఓ కేవి చెన్నయ్య, సూపర్ వైజర్లు, పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలో 4818 మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించామని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ వో డాక్టర్ సృజన పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు నూలు పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల పి.హెచ్ సంధ్య కుమారి, జకరయ్య, హెచ్‌ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

5964 మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు..

మద్దిపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్న 5599 మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించినట్లు కాకర్ల, మద్దిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయి రుచిత, వీరబాబులు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 17న అందిస్తామన్నారు. వైద్యాధికారి తేజ, సీహెచ్‌ఓ నాగేశ్వరరావు, సూపర్ వైజర్ రమాదేవి, అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.


సింగరాయకొండలో మాత్రలు వేస్తున్న డాక్టర్ ధీరేందర్

సింగరాయకొండ: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో నూరు శాతం మాత్రలు అందించామని డాక్టర్ ధీరేందర్ పేర్కొన్నారు. డాక్టర్ వంశీధర్, డాక్టర్ లీనారాఫెల్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ ఆలీ, విజయమ్మ, సంపూర్ణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


పీసీపల్లిలో మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో సృజన

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


రైతులకు సూచనలిస్తున్న హెచ్ఓ రామాంజనేయులు

సీఎస్‌పురం(పామూరు): మిరప, బత్తాయి పంటలను ఆశించే తెగుళ్లపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఎస్‌పురం, కనిగిరి ఉద్యానవన శాఖాధికారులు కే.కుసుమ, పి.రామాంజనేయులు అన్నారు. మండలంలోని గోగులపల్లెలో సోమవారం ఉద్యానవనశాఖ ఆద్వర్యంలో రైతుశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మిరపను ఎక్కువగా తామరపురుగు, నల్లి ఆశిస్తుందన్నారు. తామర పురుగువల్ల ఆకులు అంచులవెంబడి పైకి ముడుచుకుపోతాయన్నారు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ఆకులు ఎర్రగా మారడం, చెట్టు ఎదుగుదల తగ్గిపోవడాన్ని గమనించవచ్చని తెలిపి నివారణ చర్యలు వివరించారు. అనంతరం బత్తాయి తోటను క్షేత్రస్థాయిలో సందర్శించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిరియం వెంకటేశ్వర్లు, ఉద్యాన సహాయకులు వెంకటేష్, అఖిల్, పర్వీన్, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీసర్వే

హనుమంతునిపాడు: మండలంలో వీరరాంపురం రెవెన్యూ గ్రామ పంచాయతీలో జరుగుతున్న భూముల రీసర్వేను మండల రీ సర్వే బృందం అధికారి కె.రమణయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే జరుగుతున్న భూమిలోకి వెళ్లి రీసర్వేను పరిశీలించారు. భూముల రికార్డుల పరిశీలించారు. సర్వే జరిగే ముందు భూమి యజమాని పిలిపించి రైతు సమక్షంలో రీసర్వే చేయాలన్నారు. పొరపాట్లు జరగకుండా సర్వే నంబర్లు అన్ని రికార్డుల ప్రకారం పరిశీలించి చేయాలన్నారు.

వరికోత యంత్రం కిందపడి వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టంగుటూరు: ప్రమాదవశాత్తు వరికోత యంత్రం కిందపడి ఓవృద్ధుడు మృతి చెందాడు. ఈఘటన మండలంలోని సూరారెడ్డిపాలెం పొలాల్లో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పీలా పాండు (75) తన సొంత పొలంలో వరి కోతలకు యంత్రాన్ని పిలిపించుకున్నాడు. యంత్రం వరికోసే పనిలో ఉండగా పాండు పక్కన పిచ్చి మొక్కలు తీస్తున్నాడు. ఈక్రమంలో గమనించని వరికోత యంత్రం డ్రైవర్ పాండుపై వెళ్లింది. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉండగా వారందరికీ వివాహమైంది. స్థానికులు గమనించి టంగుటూరు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును గమనించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


క్రీడా వస్తువులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సావిత్రి

హనుమంతునిపాడు: విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, ప్రాథమిక పాఠశాలలను ఎంపీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, వసతులను పరిశీలించారు. విద్యార్థులు పెంకుటిళ్లు కావడం వలన చలికి ఇబ్బందులు పడుతున్నాం.. పక్కా భవనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు అందించిన క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, వైఎస్ ఎంపీపీ కొదమల బెంజిమెన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


కోటిరెడ్డి మృతదేహం


పులి కోటిరెడ్డి (ఫైల్)

మద్దిపూడి: అనుమానాస్పదత స్థితిలో ఓవ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మద్దిపూడి పంచాయతీ పరిధిలోని గంగపాలెం (కొత్తూరు) గ్రామానికి చెందిన పులి కోటిరెడ్డి (40) మండలంలోని దుగ్గిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కోటేశ్వరమ్మను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బతకాలని అనిపించలేదని, చనిపోవాలనిపిస్తుందని తమ బంధువులకు చెప్పి, గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కోటిరెడ్డికి కోసం బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండకింద ఉన్న బోడచట్టు వద్ద శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పక్కన పురుగుల మందు బాటిల్ పడి ఉండటం చూసిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం


మస్తాన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

పామూరు: మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన వాచ్‌మెకానిక్ షేక్ మస్తాన్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. ఈసందర్భంగా డయాలసిస్ చేయించుకుంటున్న మస్తాన్‌ను సోమవారం మండల సెల్ పాయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకట మహేష్‌లు, సభ్యులు మస్తాన్ ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.14 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



పనులు చేస్తున్న కార్మికులు

కొండపి: మధ్యలో ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులను అధికారులు సోమవారం తిరిగి ప్రారంభించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 15 రోజులు క్రితం గుంతలు తీసి, బ్రిక్స్ తో చదును చేశారు. అనంతరం 10 రోజుల నుంచి ఇప్పటివరకు ఒక పని కూడా ప్రారంభించకపోవడంతో బ్యాంకు లోనికి వెళ్లే ప్రజలు, ఆ ప్రాంతంలో ఉండే ప్రజలు మెయిన్ రోడ్ లోనికి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివారం 'నత్త నడకన సాగుతున్న పనులు' అనే శీర్షికతో సాక్షిలో కథనం వెలువడింది. కథనానికి స్పందించిన అధికారులు సోమవారం తిరిగి పనులు ప్రారంభించారు. ఇకనైనా మధ్యలో ఆపకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అనంతరం సాక్షికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సాగుభూమి పట్టాలు ఇవ్వాలని వినతి

సీఎస్‌పురం(పామూరు): సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు, ప్రభుత్వ భూములను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.వై.పెదమస్తాన్ అన్నారు. ఈసందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లుకు పేదలతో కలిసి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా సొంతస్థలాలులేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామన్నారు. తమ కష్టాలను గుర్తించి స్థలాలు, కాలనీలు, సాగు భూములు మంజూరుచేసి ఆదుకోవాలని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.నరసింహులు, వెంకటేశ్వర్లు, రమేష్, నారాయణ, పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ


ఆర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో నూతనంగా నిర్మించిన నూతన ఆలయంలో లక్ష్మీ మహాగణపతి, ద్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం, యాగశాల శుద్ధి, మహాగణపతి హోమం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతిరుమలనాథస్వామి ఆలయంకు వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన మహాప్రాకారంను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, స్థానిక సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ ముత్యాల నారాయణరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, మాజీ జెడ్పీటీసీ ముత్యాల వెంకట సుబ్బారెడ్డి, ముత్యాల రమణారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

కనిగిరిరూరల్: విద్యుత్ టవర్ పనుల, మరమ్మతుల కారణంగా పట్టణంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్–1 ఫీడర్ పరిధిలోని ఎంఎస్ఆర్ రోడ్డు, కాశినాయన గుడి, డిపో, డిపో వెనుక వీధి తదితర ఏరియాల్లో, అలాగే టౌన్–3 ఫీడర్ పరిధిలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.22 లక్షలు



చైర్మన్, ఈఓలకు విరాళం నగదు అందజేస్తున్న దాత

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి వారి ఆలయానికి ఆదివారం రూ.2.22 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.54,980, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,480, మహాప్రాకార నిర్మాణానికి రూ.5,116, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.1,21,089, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.19,048 వచ్చినట్లు వారు తెలిపారు. కాగా అన్నదానానికి మండలంలోని చింతపూడు గ్రామానికి చెందిన ముప్పాళ్ల నరసింహరాజు, జయసుధ దంపతులు రూ.10,116 విరాళం ఇచ్చినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకటావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

హామీలు అమలు చేయాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కనిగిరిరూరల్: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు అన్నారు. మండలంలోని ఏరువారిపల్లి సచివాయలం వద్ద అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, బంజరు భూములు ఇవ్వాలని కోరుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో జీపీ రామారావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నమ్మ ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కొండపి: మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్న వెంకన్నపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ వివరాల మేరకు.. కట్టా విజయ్‌కుమార్ (30) మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం తాగుతున్నాడని, మానుకోవాలని కుటుంబ సభ్యులు, భార్య ఆదివారం రాత్రి చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన విజయ్‌కుమార్ ఇంట్లో కిటికీ ఉరేసుకుని చనిపోయాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు ఉచిత రక్తదాన శిబిరం

కొండపి: ఈనెల 12న బుధవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కందుకూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసిహెచ్ నాగయ్య, డి.మనోహర్ తెలిపారు. సోమవారం కొండపిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 76లో అడుగు పెడుతున్న సందర్భంగా ఒంగోలులోని కార్యాలయంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో కందుకూర్ డివిజన్ పరిధిలోని కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, కొండపి, సింగరాయకొండ సబ్ డివిజన్‌లోని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీహెచ్‌సీ గైనకాలజిస్ట్‌గా నాగమణి



నాగమణి

కొండపి: కొండపిలోని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గైనకాలజిస్ట్‌గా డాక్టర్ కుంభా నాగమణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ రోగులకు ప్రతినిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చానన్నారు.